# స్వాగతం కృష్ణా... శరణాగతం కృష్ణా !

- ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- శ్రీకృష్ణ నామంతో మారుమోగిన పల్లెలు
- ఉట్టి కొట్టేందుకు పోటీలు పడిన యువకులు

**బాపట్ల టౌన్:** శ్రీకృష్ణాష్టమి వేడుకలు బాపట్ల నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఊరూరా శ్రీ కృష్ణ నామం మారు మోగింది. శనివారం ఉదయం నుంచే వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణుడు వేషధారణతో చిన్నారులు అలరించారు. ముత్తాయపాలెంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ యాదవ్ యూత్ యువత, చిన్నారులు ఉట్టి కొట్టేందుకు పోటీలు పడ్డారు. శ్రీ కృష్ణుడు అత్యంత ప్రీతిగా భావించే గోవులను పూజించారు. తొలుత గ్రామంలోని దేవాలయం ప్రాంగణంలో కమిటీ సభ్యులు 2000 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో యాదవ్ యూత్ కమిటీ సభ్యులు గవిని గోపిరాజు, అంకిరేకుల కోటేశ్వరరావు, నర్రా నరసింహారావు, వల్లు నాగేశ్వరరావు, నక్కల తిరుపతయ్య, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**కర్లపాలెం:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పెదగొల్లపాలెం, నల్లమోతువారిపాలెం, యాజలి, తుమ్మలపల్లి, బుద్ధాం, బోలాయపాలెం, పేరలి గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు శ్రీ కృష్ణుణి వేషధారణలో అలరించారు. వేడుకల్లో యువకులు, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

### సంతాన వేణుగోపాలస్వామి దేవాలయంలో పూజలు

**అద్దేపలి(భట్టిప్రోలు):** భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో గల శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వి నాగ శేషాచార్యులు పూజలు నిర్వహించారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాలకు చెందిన భజన సమాజాల తాళం భజనలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం చిన్నారులతో శ్రీరాధాకృష్ణుల వేష ధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పలువురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



ముత్తాయపాలెంలో ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న యువకులు, చిన్నారులు



చెరుకుపల్లిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఉయ్యాల సేవలో మహిళలు

### వెల్లటూరులో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**వెల్లటూరు(భట్టిప్రోలు):** భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని గీతా జ్ఞాన మందిరంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భగవద్గీత పారాయణం జరిగింది. వేములపల్లి వనజాక్షమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పుర వీధుల్లో శ్రీ కృష్ణ భగవానుడి రథోత్సవం శోభాయమానంగా జరిగింది. గ్రామానికి చెందిన కోలాట బృందం నిర్వహించిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కారుమూరు గ్రామానికి చెందిన రాఘవయ్య బృందం ఆధ్వర్యంలో భజనలు, కోలాట ప్రదర్శన సందడిగా సాగాయి. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ సర్వ మానవాళికి మార్గదర్శి శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన భగవద్గీత అనుసరణీయమని తెలిపారు. రథోత్సవంలో స్వామికి భక్తులు దివ్య నీరాజనాలు పలికి, భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో రేపల్లె ఖండ ప్రముఖ్ త్రాప రవికుమార్, గీతా మందిర కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

### గీతా సాధన మండలి ధ్యేయం

**భట్టిప్రోలు:** సర్వ జనులకు గీతా సూత్రాలు, కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యాది విషయాలను ప్రబోధించి, ప్రచారం చేయడం కోసం సాధన మండలి స్థాపించినట్లు గుంటూరు, కృష్ణా జిల్లాలు, దాస సాహిత్య ప్రాజెక్ట్ తిరుమల తిరుపతి దేవస్థానాలు (తిరుపతి) గడ్డిపాటి శ్రీనివాసరావు (వాసు) పేర్కొన్నారు. శనివారం భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని స్వర్ణోత్సవం, శ్రీకృష్ణాష్టమి నిర్వహించారు. ఆ సందర్భంగా వాసు మాట్లాడుతూ భక్తులకు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రబోధించడం, సుఖ శాంతులతో కూడిన దివ్య జీవితాలు గడపడానికి దాస సాహిత్య ప్రాజెక్ట్ దోహదం చేస్తుందని తెలిపారు. నిర్వాహకులు, అధ్యక్షులు బూర్లె అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉభయ భాషా ప్రవీణ హరి అన్నయ్య శాస్త్రి (శృంగేరి పీఠం-రేపల్లె) ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలన, గోపూజ, హోమాలు, వ్యవస్థాపకులు, స్థల దాతల వారసులకు, విగ్రహ దాతలు, మాజీ అధ్యక్షులు, అతిథులకు సన్మానం చేశారు. మధ్యాహ్నం సమారాధన, దీపోత్సవం, కోలాటం, ఉట్టి మహోత్సవం, వసంతోత్సవం, ఊయల సేవ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె. సంధ్యారాణి, కె. యశోదాదేవి, ఎం.వి. హృదయ ధనలక్ష్మి, పి.దేవసేన ఆండాళ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణుడి జననం అద్భుతం

**రేపల్లె:** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 28వ వార్డు యాదవనగర్‌లోని వేపాలమ్మ చెట్టు వద్ద లక్ష్మి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీకష్ణ జననం అద్భుతమని తెలిపారు. పుట్టగానే యమునా నది దారిచ్చిందని, విషం పాలు ఇవ్వటానికి వచ్చిన పోతనను రక్తం పీల్చి సంహరించాడని తెలిపారు. నోటిలో పదునాలుగు లోకాలను చూపించడం, రాతిరోలు లాక్కొని వెళుతూ ఇద్దరు గంధర్వులకు మోక్షం ప్రసాదించాడని చెప్పారు. పాలు, వెన్న మీగడలను దొంగిలించి తోటి బాలురకు పౌష్టికాహారంగా పంచాడని వివరించారు. ఇలాంటి అద్భుతాలు మానవ మాత్రలకు సాధ్యం కాదని, శ్రీకష్ణుని జననం, బాల్యం ఒక అద్భుతం అని వివరించారు. అందుకే శ్రీకృష్ణ జన్మాష్టమిని ఉత్సవాలుగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, జిల్లా ప్రభుత్వ సంబంధాల ప్రముఖ్ బొలగాని వెంకటేశ్వర్లు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, జంగం శ్యాంప్రసాద్, శొంఠి బాబూరావు, గొరిపర్తి రాధమ్మ పాల్గొన్నారు



రేపల్లె యాదవనగర్‌లో జరిగిన కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

### వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

**చెరుకుపల్లి:** స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో బైసాని హరినారాయణ హైమావతి, బైసాని భగవన్, జ్యోతిరత్నం, బైసాని సత్యనారాయణ, మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలోశ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకే శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు చేసి ఉయ్యాల సేవ నిర్వహించారు. వేణుగోపాలస్వామికి తులసిమాలలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయంలో గీతా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం ఆలపించారు. అనంతరం ఆర్యవైశ్య మహిళలు ఆలయ ప్రాంగణంలో కోలాట భజన చేశారు. సాయంత్రం పలు దేవాలయాల ప్రాంగణాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గొల్లపూడి అరుణకుమారి, వేముల జయశ్రీ, గొల్లపూడి సీతామహాలక్ష్మి, విస్సంశెట్టి కుసుమాంబ, రమాదేవి పాల్గొన్నారు.



తుమ్మలపల్లిలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, యువకులు



అద్దేపల్లిలో జరిగిన పూజల్లో పాల్గొన్న మహిళలు



వెల్లటూరులో రథోత్సవంలో భాగంగా కోలాటం నిర్వహిస్తున్న బృందం



భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో గోవుకు పూజలు

## క్లుప్తంగా

### వై.వి.సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన చేజర్ల



**బాపట్ల:** వైఎస్సార్ సీపీ రీజినల్ కో- ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. తాడేపల్లిలోని వై.వి.సుబ్బారెడ్డి నివాసంలో ఆయన్ను కలసి పదవి దక్కేందుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, బుల్లిరెడ్డి, కోటా వెంకటేశ్వర రెడ్డి, జాలి రామిరెడ్డి ఉన్నారు.

### వెంకటేశ్వరరావు పనితనం అభినందనీయం



**తెనాలి టౌన్:** వృత్తిలో నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకున్న తెనాలి వెంకటేశ్వరరావు అభినందనీయులని ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినుకొండ రాజారావు పేర్కొన్నారు. శనివారం తెనాలి వచ్చిన ఆయన వెంకటేశ్వరరావును దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. సినీ,రాజకీయ ప్రముఖులకు రాజారావు పాదరక్షలు తయారు చేసి వారి మన్ననలు పొందినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ప్రత్యేక విధానంలో పాదరక్షలు తయారు చేసి వారి ప్రేమాభిమానాలు పొందినట్లు చెప్పారు. వెంకటేశ్వరరావు వృత్తిలో అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తారని వివరించారు. కార్యక్రమంలో బుల్లా సుధీర్, కొండేటి ప్రసాద్, పత్రా నవీన్, సన్ని పోగు జాన్ పాల్గొన్నారు.

### ఆరో రోజుకు చేరిన మహిళా ఉద్యోగి నిరాహార దీక్ష

**తెనాలి రూరల్:** తెనాలి టెలిఫోన్ ఎక్స్చేంజ్ ఆవరణలో కస్టమర్ సర్వీస్ సెంటర్‌ను ప్రైవేటు ఏజెన్సీకి అప్పజెప్పడాన్ని నిరసిస్తూ తెనాలి టెలికాం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కె. పద్మావతి చేపట్టిన నిరసన శనివారం ఆరో రోజుకు చేరింది. ప్రైవేటు ఏజెన్సీ వాళ్లు ఎక్స్చేంజ్ ఖాళీ చేసి బయట సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, అందుకు సంబంధించి లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే తాను దీక్ష విరమిస్తానని పద్మావతి ఇప్పటికే స్పష్టం చేశారు. అందుకు ఉన్నతాధికారులు గురువారం సుముఖత వ్యక్తం చేశారు. అయితే, శనివారం అధికారులు ఆమె సస్పెండ్ అయ్యిందని, సంస్థకు ఆమెకు సంబంధం లేదని, నిరసన విరమించి వెళ్లాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. తనకు సస్పెండ్ చేసినట్టు ఏ విధమైన పత్రం అందలేదని, ప్రైవేటు ఏజెన్సీని ఎక్స్చేంజ్ ఆవరణ నుంచి బయటకు పంపే వరకు తన దీక్ష కొనసాగుతుందని పద్మావతి స్పష్టం చేశారు.

### కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి



**దుగ్గిరాల:** పేద కాపు మహిళల వివాహానికి పెళ్లి కానుక పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని ప్రజా కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఈమనిలో ఏర్పాటు చేసిన సమావేశంలో దుగ్గిరాల మండల కాపు నాడు అధ్యక్షుడిగా ఎన్నికైన వెలివెల కృష్ణారావుకు నియామక పత్రం అందించి మాట్లాడారు. కాపులంతా ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈమనిలో కాపు కల్యాణ మండపాన్ని ప్రభుత్వం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఆళ్లమల్ల సుబ్రహ్మణ్యం, కరుణశ్రీ, జ్యోతి రామిరెడ్డి, ఆదిత్య, కిరణ్ పాల్గొన్నారు.

### కంప్యూటర్ కోర్సులపై అవగాహన అవసరం



**తెనాలి అర్బన్:** కంప్యూటర్ కోర్సులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్ పేర్కొన్నారు.ఎస్ఎస్ కంప్యూటర్ అకాడమి, జేవీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రకాశం రోడ్డులో కంప్యూటర్ కోర్సులపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంఎస్ ఆఫీసు, సీ, సీ ప్లస్ ప్లస్, జావా తదితర కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కృపాచారి, డాక్టర్ అనుపమ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ గిరి, శ్రీధర్, రవితేజ, ఏబినైజర్, పద్మ, భార్గవి పాల్గొన్నారు.

## దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**నిజాంపట్నం:** ప్రభుత్వంతో పాటు దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అడవులదీవి ఎస్ఐ బాబూరావు సూచించారు. గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన అడవులదీవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. పుష్పహాసినికి శనివారం పాఠశాలలో డాక్టర్ దేవరాజ్ బడుగు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐపీఎస్ డాక్టర్ బి.డి. పాల్సన్ ఆర్థిక సహకారంతో పదివేల రూపాయల నగదు బహుమతి, రోలింగ్ ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఐ బాబూరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని తెలిపారు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వంతోపాటు దాతలు కూడా చేయూతను అందిస్తున్నారని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు శ్రమించాలని కోరారు. అనంతరం విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, బీవీఆర్ మాస్టర్, దాత బడుగు భోజరాజు పాల్గొన్నారు.



విద్యార్థినికి ట్రోఫీ, నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఎస్ఐ బాబూరావు, దాతలు

## మత్తుతో యువత జీవితాలు చిత్తు

**చెరుకుపల్లి:** యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలతో పాటు కుటుంబాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ టి.అనీల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఐలాండ్ సెంటర్‌లో గంజాయి నిర్మూలన లక్ష్యంగా ఆటో డ్రైవర్లకు శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం కరోనా వైరస్ కంటే అత్యంత ప్రమాదకరమైనదని తెలిపారు. గంజాయి వినియోగం సమాజంలో విలువ లేకుండా చేస్తుందని చెప్పారు. చెడు స్నేహాల వల్ల మత్తు పదార్థాలకు అలవాటు యువత బంగారు భవిషత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ఒక్క డ్రైవర్లే కాకుండా యుక్తవయసు వచ్చిన యువకులను తల్లిదండ్రులు నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని ఆయన సూచించారు. అనంతరం మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు. క్యార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అనీల్‌కుమార్

## మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి

**తెనాలి టౌన్:** భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని శనివారం పట్టణ, రూరల్ పరిధిలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక శివాజీచౌక్‌లో పార్టీ నాయకులు అడపా సంపత్‌రాయుడు ఆధ్వర్యంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు సీహెచ్.విజయభాస్కర్‌రెడ్డి, బిట్రా కనకదుర్గ, కె.శ్రీనివాస్, ఎస్.రవీంద్ర, అడుసుమల్లి సుధాకర్, దేవరాజు, పి.గోపి, కుశల్‌రాజ్ జైన్, కె.శ్రీనివాస్, కామేశ్వరరావు, శంకరరావు, సాయి, హనుమంతరావు, సాయిగుప్తా, సందీప్ ఉన్నారు.

■ రూరల్ మండలం అంగలకుదురులో పార్టీ మండల అధ్యక్షుడు కడియాల నందకిషోర్ ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కె.వాసుదేవనాయుడు పాల్గొని వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధిలో వాజ్‌పేయి పాత్రను వివరించారు. కార్యక్రమంలో నేతలు కనగాల సత్యం, డి.జార్జి, ఎం.వీరయ్య, కొత్తపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

■ రూరల్ మండలం నందివెలుగులో శనివారం వాజ్‌పేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ కిసాన్‌మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలేఉ శాఖమూరి శంకరరావు, కె.రామస్వామి, పి.రామారావు, కె.శ్రీనివాసరావు,సుబ్బయ్య పాల్గొన్నారు.



శివాజీ చౌక్‌లో నివాళులర్పిస్తున్న నేతలు

## బీసీల అభ్యున్నతికి గౌతు లచ్చన్న కృషి

**భట్టిప్రోలు:** స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది, వీఆర్వోలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి లచ్చన్న చేసిన కృషిని తహసీల్దార్ వివరించారు. లచ్చన్న జీవిత విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్ఐ పీవీ. శివరామకృష్ణ, వీఆర్వోలు కాశీకృష్ణ, అంబటి ప్రసాద్, శ్రీనివాసరావు, వీఆర్ఏలు వీరయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ సుభాని



భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వీఆర్వోలు

### లచ్చన్న పోరాటం మరువలేనిది

**రేపల్లె:** స్వాతంత్ర్య సమరంలో సర్దార్ గౌతు లచ్చన్న చేసిన పోరాటం మరువలేనిది టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ తెలిపారు.టీడీపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో శనివారం గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీఆర్ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోడపాటి శ్రీనివాసరావు, మేకా రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకం

**చెరుకుపల్లి:** సర్దార్ గౌతు లచ్చన్న పోరాటం స్ఫూర్తిదాయకమని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లచ్చన్న 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుభాని మాట్లాడుతూ లచ్చన్న జాతిని జాగృతి పరచి, సంఘీయుల్లో చైతన్యం తెచ్చారని తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**దుగ్గిరాల:** అధిక వర్షాల వల్ల వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ఎకరాకు రైతుకు రూ.15 వేలు ప్రభుత్వం అందించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం బృందం శనివారం దుగ్గిరాల మండలంలోని పెనుమూలి, మంచికలపూడి, పెదకొండూరు, గ్రామాల్లో పర్యటించింది. అజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వరి వెద పద్ధతిలో వేయడం వల్ల అకాల వర్షాలకు సుమారు లక్ష ఎకారాల్లో నష్టం వాటిల్లిందన్నారు. మురుగు నీటి కాలువల్లో తూటి కాడ, గుర్రపు డెక్క సరిగా తొలగించక పోవడం ద్వారా పారుదల లేక పంట నీటి మునిగిందని తెలిపారు. ప్రభుత్వం హడావుడిగా కాకుండా, శాశ్వతంగా పరిష్కరించే విధంగా కాలువలను మెరుగు పరచాలని ఆయన కోరారు. రైతు మరల పంట వేయడానికి ఎకరాకు రూ.15 వేలు తగ్గకుండా సహాయం చేసి ఆదుకోవాలన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 18న మండల కేంద్రాల్లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మన్నవ నాగమల్లేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వర రావు, ఎం.శివ సాంబిరెడ్డి, ఎం.భావన్నారాయణ, అమ్మిరెడ్డి, అంజిరెడ్డి, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న నేతలు


### 'స్వచ్ఛత సేవ'లో ఉద్యోగులంతా పాల్గొనాలి

**తెనాలి అర్బన్:** స్వచ్ఛత సేవా కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొనాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపాపరు. కార్యక్రమంలో భాగంగా శనివారం డిపో ఆవరణలో ని పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో మూడో శనివారం స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని సూచించారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



### దాతల సేవా నిరతి అభినందనీయం

**తెనాలి టౌన్:** నిరుపేద బాలబాలికలకు ఆర్థికసాయం అందించిన దాతల సేవా నిరతి అభినందనీయమని జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ కావూరి చంద్రమోహన్ కొనియాడారు. గుడివాడ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ యడ్లపాటి రాకేష్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పేద కుటుంబాలకు చెందిన తొమ్మిది మంది బాలబాలికలకు దాతల సహకారంతో సర్పంచ్ రాకేష్ రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించారు. సహకరించిన దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిశోర్, కె.రాజ్యలక్ష్మి, కార్తిక్, రవీంద్రనాథ్ చౌదరి, వెంకట చంద్రశేఖర్, జి.సాగరిక, పి.వెంకటేశ్వరరావు, రవికిశోర్, శ్రీనివాసరావు, మాతాంగి రత్నం, కంచర్ల వీరయ్య, సంధ్యారాణి, తేజ, క్రాంతి, ఐశ్వర్య, శ్రీవల్లి పాల్గొన్నారు.



సర్పంచ్ రాజేష్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు